నేటి భారత్ బంద్‌ని విజయవంతం చేయాలి


కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

చాంద్రాయణగుట్ట: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా నేడు తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ కోరారు. ఈ మేరకు గురువారం జహంగిరాబాద్‌లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మతోన్మాద, కార్పొరేట్ విధానాలు అనుసరిస్తోందన్నారు. అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశ వ్యాప్త సెక్టోరియల్, ఇండస్ట్రీయల్ భారత్ బంద్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బంద్‌లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని మోదీ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌస్ అహ్మద్, హనీఫ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

నేడు ఆలిండియా కార్మిక సమ్మె

అఫ్జల్‌గంజ్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన హిట్ అండ్ రన్ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యాదర్శి ఎల్.కోటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మహాత్మా గాంధీ బస్‌స్టేషన్ ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు నిర్వహించే ఆలిండియా కార్మిక సమ్మెలో భాగంగా వందలాది మందితో సంతోశ్‌నగర్‌లో భారీ కార్మిక ప్రదర్శన చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంజీబీఎస్ కమిటీ అధ్యక్షుడు సంతోశ్, పి.నాగేశ్వర్, ఎండీ అజీజ్ బాబా తదితరులు పాల్గొన్నారు.



ఎంజీబీఎస్‌లోని ఆటో స్టాండ్‌లో పోస్టర్ ఆవిష్కరణ

18న దయానంద సరస్వతి శోభాయాత్ర


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ధర్మతేజ

సుల్తాన్‌బజార్: మహర్షి దయానంద సరస్వతి 200 జయంతి ఉత్సవాలు ఫిబ్రవరి 18న ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవాల కమిటీ సభ్యుడు డాక్టర్ డి.ధర్మతే తెలిపారు. ఈ మేరకు గురువారం బడీచౌడి ఆర్య సమాజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్య సమాజ్ సంస్థాపకుడు దయానంద సరస్వతి జయంతిని రెండేళ్ల పాటు పెద్ద ఎత్తున నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని గుర్తు చేశారు. ఈక్రమంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 10 గంటలకు నిజాం కాలేజీ నుంచి రవీంద్రభారతి వరకు జయంతి శోభాయాత్ర ఉంటుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతిలో సభ ఉంటుందని చెప్పారు. జయంతి కార్యక్రమాల్లో భాగంగా ఉభయ రాష్ట్రాల్లో పలు విద్యాసంస్థల్లో వ్యాసరచన, వకృత్వం, క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 18న జరిగే శోభా యాత్రకు పెద్ద ఎత్తున దేశభక్తులు, కార్మికులు పాల్గొనాలని ధర్మతే పిలుపునిచ్చారు.

సఫాయిల సమస్యలు పరిష్కరించండి


చైర్మన్ వెంకటేశంను కలిసిన సతీశ్

జియాగూడ: రాష్ట్రంలో సఫాయి ఖరమ్‌చారీలు సామాజికంగా, ఆర్థికంగా పూర్తిగా వెనుకబడి ఉన్నారని బీజేపీ ఎస్సీ మోర్చ మాజీ అధికార ప్రతినిధి సతీశ్ బిడ్ల తెలిపారు. ఈ మేరకు గురువారం నగరానికి వచ్చిన నేషనల్ కమిషన్ సఫాయి ఖరమ్‌చారి చైర్మన్ వెంకటేశంకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. నేడు సీఎం రేవంత్‌రెడ్డి, చీఫ్ సెక్రెటరీలను వెంకటేశం కలువనున్న సందర్భంలో సఫాయి ఖరమ్‌చారి సమస్యలను వారి ముందు ఉంచాలని కోరామన్నారు. ముఖ్యంగా ఖరమ్‌చారీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించకపోవడంతో కాంట్రాక్టు పద్ధతిలో బతుకు వెళ్లదీస్తున్నారని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా మేతర్ సమాజ్ కుల ధ్రువీకరణపత్రం నేటికీ ఆర్డీఓ ద్వారా లభిస్తుండటంతో తాము నాన్ లోకల్‌గా ఉండిపోయామన్నారు. తమకు నేరుగా ఎమ్మార్వో ద్వారానే కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు.

ఆలయాల అభివృద్ధికి కృషి


పూజలు చేసిన కార్పొరేటర్ దర్శన్, సత్యనారాయణ

జియాగూడ: స్థానికంగా ఉన్న ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు కార్పొరేటర్ బోయిని దర్శన్ తెలిపారు. ఈ మేరకు గురువారం జియాగూడ ఇమాంపురాలో శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు నవభారత్ సంఘం అధ్యక్షుడు మధిర సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్పొరేటర్ దర్శన్ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆలయంలో మహా ఛండీహోమం, పాలాభిషేకం, పుష్పాభిషేకం, శ్రీ రేణుకా ఎల్లమ్మ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. చివరగా అఖండ హారతి, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు యాదయ్య, బాలకిషన్, వినయ్‌కుమార్, జశ్వంత్‌కుమార్, మహేశ్‌బాబు, శ్రీకాంత్, లక్ష్మీనారాయణ, చిన్న, వీరశైవ కక్కయ్య సమాజ్ అధ్యక్షుడు దత్తుపోల్, తులసీదాస్, శ్యామ్, మల్లేశ్, వినోద్ చౌగ్లే పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులకు చేయూత


కార్యక్రమంలో పాల్గొన్న రాంకుమార్ తివారీ, రాకేశ్ తివారీ

చార్మినార్: పేద బ్రహ్మణులను ఆదుకోవడానికి తమ సంఘం నిరంతరం పని చేస్తుందని దక్షిణ భారతీయ కన్యకుబ్జ్ సభ అధ్యక్షుడు రాంకుమార్ తివారీ అన్నారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం పేద బ్రహ్మణ విద్యార్థులకు సహాయ సహకారాలు అందజేస్తున్నామన్నారు. వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ గురువారం పాతబస్తీ అంబికానగర్‌లోని కన్య కుబ్జ్ భవనంలో 9 మందికి ఉపనయనం కార్యక్రమం నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వస్తు సామగ్రిని సభ అందజేసింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాంకుమార్ తివారీ మాట్లాడుతూ.. ఇప్పటికే పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందజేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా ఏటా ఉపనయనం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాకేశ్ తివారీ, ప్రధాన కార్యదర్శి విజయ్‌పాల్ పాండే, కోశాధికారి గోపాల్ ప్రసాద్ శుక్లా, సంయుక్త కార్యదర్శి భవానీ ప్రసాద్ తివారీ, బాల ప్రసాద్ తివారీ, రాజేంద్రప్రసాద్ తివారీ, శోభా దూబే, జయశంకర్ తివారీ పాల్గొన్నారు.

నాలాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

యాకుత్‌పురా: వర్షాకాలంలో నాలాల సమస్యలు తలెత్తకుండా మరమ్మతులు చేపట్టాలని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ కోరారు. గురువారం ఆయన పలు విభాగాలకు చెందిన అధికారులతో కలసి యాకుత్‌పురా, యశ్రఫ్‌నగర్, చోటాపూల్, మదీనానగర్ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలాలు, డ్రైనేజీ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వసీవుద్దీన్ మాట్లాడుతూ.. యాకుత్‌పురా పరిసరా ప్రాంతాల్లో నాలాల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆయనతో మజ్లిస్ పార్టీ నాయకులు, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది.. ఇబ్బంది..!

- తహసీల్దార్ కార్యాలయాల్లో అరకొర సిబ్బంది
- సకాలంలో అందని ధ్రువీకరణ పత్రాలు


చార్మినార్ తహసీల్దార్ కార్యాలయం

చార్మినార్: తహసీల్దార్ కార్యాలయాల్లో తగినంత మంది సిబ్బంది లేక ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. దాదాపు పాతబస్తీలోని అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లో ఇదే పరిస్థితి. ఫలితంగా సకాలంలో ధ్రువీకరణపత్రాలు అందడం లేదని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సిబ్బంది కీలకం. భూముల కబ్జాలు, బాధితుల ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు వీరంతా కార్యాలయాల్లో ఉండాల్సిందే. అయితే, ఉన్న సిబ్బంది ఏమాత్రం సరిపోవడం లేదని రెవెన్యూ అధికారులే చెబుతుండటం గమనార్హం.

ధ్రువీకరణపత్రాల పంపిణీలో జాప్యం

సిబ్బంది కొరత కారణంగా కుల, నివాస, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల పంపిణీలో జాప్యం జరుగుతోంది.పాతబస్తీలో చార్మినార్, బండ్లగూడ, బహదూర్‌పురా, సైదాబాద్ తదితర తహసీల్దార్ కార్యాలయాలున్నాయి. వీటిలో అధికారులతో పాటు కిందిస్థాయి సిబ్బంది అవసరమైన మేరకు అందుబాటులో లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా ఉదయ్‌కుమార్



అబిడ్స్: సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా డి.ఉదయ్‌కుమార్ రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న డీసీపీ డాక్టర్ బాలస్వామి ఇటీవల బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఉదయ్‌కుమార్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉదయ్‌కుమార్ రెడ్డి గతంలో ఆదిలాబాద్ ఎస్పీగా, మంచిర్యాల డీసీపీగా, కొత్తగూడెం ఓఎస్‌డీగా పని చేశారు. బంజారాహిల్స్ ఏసీపీగా కూడా పనిచేశారు. డీసీపీని ఏసీపీలతో పాటు ఇన్‌స్పెక్టర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

స్వల్పంగా పెరిగిన ఓటర్ల సంఖ్య

నాంపల్లి: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024(ఎస్ఎస్ఆర్–2024)లో భాగంగా ఇటీవల నాంపల్లి నియోజకవర్గ ఎన్నికల అధికారులు తుది ఓటరు జాబితా విడుదల చేశారు. జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3,22,968 మంది ఉన్నారు. ఇందులో పురుషులు 1,65,581 మంది, మహిళలు 1,57,379 మంది, థర్డ్ జెండర్ 8 మంది ఉన్నారు. మృతి చెందిన ఓటర్లు 15,354 మందిని జాబితా నుంచి తొలగించారు. ఒక పోలింగ్ స్టేషన్ నుంచి మరో పోలింగ్ స్టేషన్‌కు 1,338 మందిని మార్చారు. ఇదిలా ఉండగా, ఓటరు జాబితా సవరణలో భాగంగా జనవరి 6న విడుదల చేసిన ముసాయిదా జాబితాతో పోలిస్తే మొత్తంగా 2,504 మంది ఓటర్లు పెరిగారు. గత ఏడాది నవంబరులో జరిగిన విధాన సభ ఎన్నికల్లో ఓటర్లు 3,21,159 ఉండగా, సవరణల అనంతరం స్వల్పంగా ఓటర్ల సంఖ్య పెరగడం విశేషం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నోటిఫికేషన్ తర్వాత మరోసారి జాబితాను ప్రకటిస్తారు.

నాంపల్లి జీఆర్పీ సీఐగా ప్రవీణ్‌కుమార్

నాంపల్లి: జనరల్ రైల్వే పోలీసు స్టేషన్(జీఆర్పీ) ఇన్‌స్పెక్టర్‌గా ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ సికింద్రాబాద్ రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. ఆయన ఇక్కడ ఐదు సంవత్సరాల తొమ్మిది నెలలు పనిచేయడం విశేషం. ఈ పోలీసు స్టేషన్‌లో ఐదేళ్లకు పైబడి ఎవరూ పనిచేయలేదు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరిగిన బదిలీల్లో రాచకొండ పోలీసు కమిషనరేట్ నుంచి నాంపల్లి జీఆర్పీ రైల్వేస్టేషన్‌కు ప్రవీణ్‌కుమార్ బదిలీపై వచ్చారు.

700 రోజులు దాటిన నిత్యాన్నదానం

గోల్కొండ: నిత్య అన్నదాన కార్యక్రమంలో 700 రోజులు పూర్తి చేశామని ప్రముఖ సంఘ సేవకుడు, గోల్కొండ సెకండ్ లాన్సర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ తెలిపారు. గురువారం ఆయన మెహిదీపట్నం, టోలిచౌకీ తదితర ప్రాంతాలలోని ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో తాను నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమం 704 రోజులు పూర్తి చేసుకుందని ఆయన చెప్పారు.

మహిళల కోసం ప్రత్యేక సేవా కేంద్రం



గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం దారఖాస్తు చేసుకునే వారికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు మజ్లిస్ ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు అవుతున్నాయని మజ్లిస్ గోల్కొండ కంచ ఏరియా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ సిద్దిఖ్ తెలిపారు. ఈక్రమంలో గోల్కొండ కుమ్మర్‌వాడి కమ్యూనిటీ హాల్ వద్ద మజ్లిస్ ఆధ్వర్యంలో గురువారం మహిళల కోసం ప్రత్యేక సేవా కేంద్రం ఏర్పాటు చేశారు.

ఆకతాయికి జైలు శిక్ష


యోగేశ్

అబిడ్స్: ఈవ్‌టీజర్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. అబిడ్స్ పోలీస్టేషన్ పరిధిలో ఈవ్‌టీజింగ్ చేస్తున్న యోగేశ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ 3వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు ఇచ్చినట్టు సీఐ నర్సింహరాజు తెలిపారు. ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా నర్సింహరాజు హెచ్చరించారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటుతాం'


ఇమ్రాన్ ప్రతాప్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉస్మాన్ బిన్ అల్ హజారీ, ఇమ్రాన్ అలీఖాన్

గోల్కొండ: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుతుందని ఆల్ ఇండియా మైనార్టీ కాంగ్రెస్ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఇమ్రాన్‌ప్రతాప్ ఘడి అన్నారు. గురువారం నగరానికి వచ్చిన ఆయనను కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్వాన్ నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఇమ్రాన్ అలీఖాన్(లడ్డూ) ఇమ్రాన్ ప్రతాప్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఇమ్రాన్ ప్రతాప్ మాట్లాడుతూ.. బీజేపీ కేవలం హిందుత్వ నినాదంతోనే మనుగడ సాగిస్తోందన్నారు. మణిపూర్‌లో గిరిజన తెగలపై దాడులు జరిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీకి బలం లేని రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ సంస్థలతో దాడులు చేయిస్తోందని ఆరోపించారు. దేశంలోని అన్ని రాష్ట్రాలలో ముస్లిం మైనార్టీలు, దళితులు కాంగ్రెస్ పక్షాన ఉన్నారని చెప్పారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో మొత్తం 17 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్వాన్, మలక్‌పేట్ నియోజకవర్గాల కాంగ్రెస్ ఇన్‌చార్జీలు అబ్జల్, ఉస్మాన్ బిన్ అల్ హజారీ, ఖాజా బిలాల్, ఇమ్రాన్ అలీఖాన్ తదితరులున్నారు.

పార్టీలకు అతీతంగా సేవలు


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్

గోల్కొండ: పార్టీలకు అతీతంగా నియోజకవర్గ ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన టోలిచౌకీ మెరాజ్‌కాలనీలోని తన కార్యాలయం వద్దకొచ్చిన ప్రజలతో మాట్లాడారు. సమస్యలపై తక్షణ పరిష్కారం కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు. ప్రస్తుతం కార్వాన్‌లో రూ.292 కోట్లతో జరుగుతున్న డ్రైనేజీ పనులను ప్రతిష్ఠాత్మకంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగియగానే అన్ని ప్రాంతాలలో పర్యటించి తాగునీటి సరఫరాపై స్థానికులతో మాట్లాడుతానన్నారు. టోలిచౌకీ, గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్‌లలో బాక్స్ డ్రైన్ పనులు చివరి దశలో ఉన్నాయని.. అవి పూర్తయితే ముంపు సమస్య తలెత్తదన్నారు. పలు ప్రాంతాలలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశాలు జారీ చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ నాయకుడు హారూన్ ఫరాన్ తదితరులున్నారు.

గోల్కొండ ఏరియా ఆస్పత్రికి కొత్త ఆర్ఎంఓ


కొత్త ఆర్ఎంఓతో సూపరింటెండెంట్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రికి డాక్టర్ బి.వినాయక్ కొత్త ఆర్ఎంఓగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా గురువారం ఆయన ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌తో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా మాట్లాడుతూ.. రోజురోజుకు ఆస్పత్రికి వచ్చే అవుట్ పేషంట్ల సంఖ్య పెరుగుతోందని, ఇందుకు అనుగుణంగా వైద్యుల సంఖ్య పెంచుతున్నామన్నారు. హాస్పిటల్ అభివృద్ధికి కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

ఏసీపీతో సమావేశమైన ఉర్సు నిర్వహణ కమిటీ


ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌తో ఉర్సు నిర్వాహకులు తదితరులు

గోల్కొండ: ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ సూచించారు. గోల్కొండ రిసాల బజార్‌లోని బాబా ఉర్సు ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈక్రమంలో ఉర్సు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు, ఆల్ ఇండియా ఖిరత్ కమిటీ అధ్యక్షుడు ఖారీ సయ్యద్ మతీన్ అలీషా ఖాద్రీతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ సయ్యద్ ఫయాజ్ మాట్లాడుతూ.. చారిత్రక ప్రాంతమైన గోల్కొండ నగరంలోనే ప్రత్యేక స్థానం పొందిందన్నారు. కార్యక్రమంలో గోల్కొండ సీఐ ఎన్.వెంకటేశ్వర్లు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ తదితరులున్నారు.

ముబారక్ ర్యాలీ



డబీర్‌పురాలో గురువారం నిర్వహించిన జషన్–ఇ–జూలూస్–ఇ–షెహ్రే–ఇ–ముబారక్ ర్యాలీలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ర్యాలీ పురానీహవేలి చోటి బర్గా నుంచి ప్రారంభమై గోల్కొండలోని బర్గా–ఇ–హజ్రత్–ఇ–అబుల్ ఫజిల్ అబ్బాస్ వరకు కొనసాగింది. – డబీర్‌పురా

వివాహ వేడుకకు ఎంపీ రంజిత్‌రెడ్డి

అబిడ్స్: తెలంగాణ గోల్డ్‌మ్యాన్ దుర్గం శ్రావణ్‌కుమార్ కుమార్తె వివాహం గుడిమల్కాపూర్‌లోని కింగ్స్ కోహినూర్ కన్వెన్షన్‌లో గురువారం రాత్రి జరిగింది. వివాహ వేడుకకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, దళితరత్న అవార్డు గ్రహీత మాణిక్‌రావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.


వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రంజిత్‌రెడ్డి, మాణిక్‌రావ్

కలెక్టర్‌కు సన్మానం


కలెక్టర్‌కు మెమొంటో అందజేస్తున్న ముజీబ్

అబిడ్స్: ఇటీవల టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కలెక్టర్ అనుదీప్ పూర్తి సహకారం అందించారని అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ తెలిపారు. ఈమేరకు గురువారం కలెక్టర్‌కు మెమొరాండం అందజేసి సత్కరించారు. అనంతరం ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ.. ఉద్యోగులు క్రీడల్లో రాణించేలా కలెక్టర్ ఎంతో ప్రోత్సాహం అందించారన్నారు. ఉద్యోగులపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానానికి వ్యతిరేకంగా నేడు కలెక్టరేట్‌లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేఆర్ రాజ్‌కుమార్, బొల్లిగడ్డ శంకర్, ముఖీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



చాంద్రాయణగుట్ట: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ప్రత్యేక సలహాదారు షబ్బీర్ అలీకి టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి పర్వతాల రాజేందర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం ఆయన నివాసంలో పార్టీ నాయకుడు సాయి ఉదయ్‌తో కలిసి పూల బొకే అందజేశారు.

పేదలను ఆదుకునేందుకు ముందుకురావాలి


అక్షర అభ్యాసం చేయిస్తున్న పంకజ్‌కుమార్

చార్మినార్: సమాజంలోని పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని హైదరాబాద్ కుంభ్ మేళా అగర్వాల్ సమితి, అశోక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. గురువారం పురానాపూల్‌లోని పార్ధివాడలో పేద విద్యార్థులకు ఉచితంగా అక్షర అభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పంజక్‌కుమార్ మాట్లాడుతూ.. సమాజంలోని పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వంతో కలిసి స్వచ్ఛంద సంస్థలు పనిచేయాలన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి


జయంతిలో పాల్గొన్న భోజ్యా నాయక్

చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్‌లోని రవీంద్ర నాయక్ నగర్ కాలనీలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి గురువారం ఘనంగా జరిగింది. సేవాలాల్ సేన నిర్వాహకుడు సభావత్ గిరిధర్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఛత్రినాక ఇన్‌స్పెక్టర్ ఎ.భోజ్యానాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ నాయుకుడు ఆకుల శ్రీనివాస్, కాలనీ పెద్దలు లచ్చిరాం నాయక్, వాల్యా నాయక్, రాజేశ్వర్, యశ్వంత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్లను స్మరిస్తూ క్యాండిల్ ర్యాలీ


అమర జవాన్లకు నివాళులర్పిస్తున్న నాయకులు

చార్మినార్: పుల్వామాలో తీవ్రవాదుల దాడిలో వీర మరణం పొందిన జవాన్లను స్మరిస్తూ బజరంగ్‌దల్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం రాత్రి సుధా టాకీస్ నుంచి లాల్‌దర్వాజ మోడ్ వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బజరంగ్‌దల్ ఆర్యనగర్ జిల్లా ప్రముఖ్ పవన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వీర జవాన్లకు అనుకూలంగా నినాదాలు చేశారు. అనంతరం లాల్‌దర్వాజ మోడ్ వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

శివసేన పటిష్టతకు కృషి



అబిడ్స్: మహారాష్ట్ర తరహాలో తెలంగాణలో కూడా శివసేనా అభివృద్ధి చెందుతుందని జి.సుధాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. శివసేన పార్టీని పటిష్టపరిచేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు శింకర్ శివాజీకి కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న ఫోన్లు అందజేత


బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సైదయ్య

సంతోష్‌నగర్: పలు ప్రాంతాల్లో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరిగి అందించామని ఐఎస్‌సదన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఎస్.సైదయ్య తెలిపారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆరు సెల్‌ఫోన్లను వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు.

బాలికపై లైంగిక దాడి.. యువకుడి రిమాండ్

గౌలిపురా: ప్రేమ పేరుతో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని భవానీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాలు.. స్థానికంగా నివాసం ఉండే 16 ఏళ్ల బాలికకు రాజేంద్రనగర్ శాస్త్రీపురానికి చెందిన సయ్యద్ సాహిల్(18)తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో తరచూ చాటింగ్ చేసుకునేవారు. ఈ నెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు సదరు బాలిక కిరాణ షాపు వెళ్తున్నా అని చెప్పి సాహిల్‌తో వెళ్లిపోయింది. ఈక్రమంలో బాలిక తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వీరిద్దరినీ రాజేంద్రనగర్ పరిధిలో పట్టుకున్నారు. అయితే, సాహిల్ తనపై అత్యాచారం చేశాడని బాలిక ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నడుస్తూ కింద పడి మృత్యువాత



విజయనగర్‌కాలనీ: నడుస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెందిన సంఘటన టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగు చూసింది. అడ్మిన్ ఎస్సై మహ్మద్ అంజద్ షరీఫ్ తెలిపిన వివరాలు.. అంబేడ్కర్‌నగర్ కుమ్మరివాడి ప్రాంతంలో ఈ నెల 13న రాత్రి ఓ వ్యక్తి(35) నడుచుకుంటూ వెళ్తూ రోడ్డు మీద పడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సదరు వ్యక్తిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా, మృతుడికి మూర్ఛ వ్యాధి ఉండొచ్చన్న అనుమానాలు ఉన్నాయి. మృతుడు చిత్తు కాగితాలు సేకరించే వ్యక్తిగా పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. మృతుడి సంబంధీకులు టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించవచ్చు.